క్లుప్తంగా

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు రూపాయల్లో... టమాట 23, వంకాయ 35, బెండ 55, పచ్చిమిర్చి 55, కాకర 38, బీర 45, కాలిఫ్లవర్ 23, క్యాబేజీ 11, క్యారెట్ 23, దొండ 55, ఆలు 23, ఉల్లి 20, గోకర 40, దోస 23, సొర 10, పొట్ల 13, అరటి(ఒకటి) 9, చిక్కుడు 55, అర్వి 60, మునగ(ఒకటి) 7–5, చిలగడదుంప 25, బీట్‌రూట్ 21, కీర 23, ఫ్రెంచ్ బీన్స్ 50, క్యాప్సికమ్ 45 రూపాయలుగా ఉన్నాయి. కాగా ఈ ధరలు మంగళవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

రజక సంఘం భూమిని రక్షిస్తాం: మల్‌రెడ్డి రాంరెడ్డి



దీక్షలో భూమి పత్రాలను పరిశీలిస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

హయత్‌నగర్: హయత్‌నగర్‌లో రజక సంఘానికి కేటాయించిన భూమిని కొందరు ఆక్రమించుకుని జీఓ 59 కింద రెగ్యులరైజ్ చేసుకోవాలని చూస్తున్నారని, రజకుల భూమి ఆక్రమణకు గురి కాకుండా ఎంపీ రేవంత్‌రెడ్డి నిధులతో చుట్టూ ప్రహరీని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. బాగ్ హయత్‌నగర్‌లోని సర్వే నంబర్.207లో తమ భూమిని రక్షించాలని రజకులు చేస్తున్న దీక్షా శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ... 59 జీఓ ద్వారా ప్రభుత్వం రజకుల భూమిని అమ్ముకోవాలని చూస్తోందని, ఏళ్ల తరబడి రజకుల ఆధీనంలో ఉన్న ఈ భూమికి చుట్టూ ప్రహరీని నిర్మించేందుకు గతంలో రూ.5లక్షలు మంజూరైనా అధికారులు అంచనాలు ఇవ్వలేదన్నారు. రజకుల భూమిని రక్షించేందుకు కాంగ్రెస్ పూర్తి మద్దతు తెలుపుతుందని, ఎంత ఖర్చయినా ఎంపీ నిధులు ఇచ్చి ప్రహరీని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హయత్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, ఎల్‌బీనగర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్యాంచరణ్‌రెడ్డి, నాయకులు జైపాల్‌రెడ్డి, మాతంగి యాదగిరి, సరన్న, తోకోటి కిరణ్, గడ్డం వెంకటేష్ తదితరులు ఉన్నారు.

మహేశ్వరంలో బీఎస్పీ జెండా ఎగురవేస్తాం

బడంగ్‌పేట్: మహేశ్వరం నియోజకవర్గంలో బీఎస్పీ జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ నియోజకవర్గం అధ్యక్షుడు జి.శ్రీనివాస్ అన్నారు. బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయవతి జన్మదినాన్ని పురస్కరించుకుని బడంగ్‌పేటలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు సోమవారం బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రోజురోజుకు బీఎస్పీకి ఆదరణ పెరుగుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఎస్పీ తరఫున పోటీ చేస్తానని ప్రకటించారు. బీఎస్పీతోనే బహుజన రాజ్యాధికారం సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, ఇన్‌చార్జి సత్యానారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్‌చారి, ఉపాధ్యక్షుడు భాగ్యరాజ్, మహిళా కన్వీనర్ ఇందుమతి, బాలాపూర్ మండల అధ్యక్షుడు దాసరి కిరణ్, రాజశేఖర్, అరుణ్‌కుమార్, సురేశ్, జ్ఞానేశ్వర్, వెంకటేశ్, అనిత, లలిత, సరిత, ఇందిర రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాటం



బడంగ్‌పేట్: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాటం చేస్తామని ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి భానుప్రసాద్ అన్నారు. సోమవారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని కుర్మల్‌గూడలో జిల్లా కార్యదర్శి బొద్రమోని పురుషోత్తం ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భానుప్రసాద్ మాట్లాడుతూ.. ప్రభుత్వ హాస్టళ్ల, గురుకులాల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గం నుంచి ఎంసీపీఐ పార్టీ నుంచి అభ్యర్థిని బరిలో నిలిపేందుకు కార్యకర్తలను సిద్ధ చేస్తున్నామని వెల్లడించారు. గ్రామం నుంచి డివిజన్ స్థాయి వరకు కమిటీలు వేసి బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. అనంతరం భారత ప్రజాతంత్ర విద్యార్థి సమైఖ్య బాలాపూర్ మండల కార్యదర్శిగా పి.వరుణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే సహాయ కార్యదర్శిగా వి.శ్రీకాంత్‌ను ఎంపిక చేశారు. కార్యక్రమంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమైఖ్య జిల్లా కార్యదర్శి బి.సుజాత, నాగేంద్రమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

సొసైటీ రెన్యువల్ అయినట్టూ..కానట్టూ..!

ఆనంద్ సోప్ ఇండస్ట్రియల్ కో–ఆపరేటివ్ సొసైటీని చట్టవిరుద్ధంగా రెన్యువల్ చేసినట్లు ఆరోపణలు

- స్పష్టత ఇవ్వని అధికారులు
- ఆందోళనలో వ్యాపారులు, రైతులు
- సొసైటీ అధికారులకు లోకయుక్త నోటీసులు



మాదన్నపేట కూరగాయల మార్కెట్

చంచల్‌గూడ: కుర్మగూడ డివిజన్‌లోని మాదన్నపేట మార్కెట్ భూములపై పలు శాఖ అధికారులు విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. మార్కెట్‌లో దశాబ్దాల క్రితం నిర్వీర్యమైన పాత ఆనంద్ సోప్ ఇండస్ట్రియల్ కో–ఆపరేటివ్ సొసైటీని చార్మినార్ డిప్యూటీ రిజిస్ట్రార్ చట్టవిరుద్ధంగా రెన్యువల్ చేసినట్లు వ్యాపారులు, రైతులు ఆరోపిస్తున్నారు. ఇదే క్రమంలో సదరు అధికారితో పాటు అక్రమ రెన్యువల్ ప్రక్రియకు తెరలేపిన దయానంద్ వెజిటెబుల్ మార్కెట్ అసోసియేషన్‌లోని 7 మంది సభ్యులపై పోలీసు శాఖతో పాటు ఇతర శాఖలకు ఫిర్యాదు చేయడంతో అధికారులు విచారణ చేపట్టారు. కాగా మనుగడలో లేని సబ్బుల పరిశ్రమకు సంబంధించిన ఆనంద్ సోప్ ఇండస్ట్రియల్ కోఆపరేటివ్ సొసైటీని యుద్ధ ప్రతిపాదికన సదరు అధికారి ఎందుకు రెన్యువల్ చేయాల్సి వచ్చిందని వ్యాపారులు, రైతులు ప్రశ్నిస్తున్నారు. కాగా సొసైటీ రెన్యువల్ అంశానికి సంబంధించి ఉన్నతాధికారులు మాత్రం స్పష్టత ఇవ్వడం లేదు. ఇదే అంశం ఇటీవల పలువురు సభ్యులను సీసీఎస్ పోలీసులు విచారించారు.

అధికారులకు లోకాయుక్త నోటీసులు..

ఆనంద్ సోప్ ఇండస్ట్రియల్ కో–ఆపరేటివ్ సొసైటీ అంశంలో అధికార దుర్వినియోగం, సొసైటీ అక్రమ రెన్యువల్ ఫిర్యాదుకు సంబంధించి పలువురు తెలంగాణ లోకాయుక్తను ఆశ్రయించారు. దీంతో నాలుగు వారాల్లో పూర్తి నివేదిక ఇవ్వాలని హైదరాబాద్ జిల్లా కో–ఆపరేటివ్ అధికారికి లోకయుక్త నోటీసులు జారీ చేసింది.

అధికారి రహస్య సమావేశం..!

నష్టనివారణ చర్యల్లో భాగంగా సదరు అధికారి ఐఎస్ సదన్‌లోని వినయ్‌నగర్ కమ్యునిటీ హాల్లో ఆనంద్ సోప్ ఇండస్ట్రియల్ కో–ఆపరేటివ్ సొసైటీకి సంబంధించిన పలువురితో రహస్య సమావేశం నిర్వహించినట్లు విశ్వసనీయ సమాచారం. తద్వారా వివిధ శాఖలతో పాటు లోకయుక్తలో ఇచ్చిన ఫిర్యాదులు తిరిగి తీసుకోవాలని ఫిర్యాదుదారులపై పరోక్షంగా ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. నిర్వీర్యమైన ఆనంద్ సోప్ ఇండస్ట్రియల్ కో–ఆపరేటివ్ సొసైటీ రెన్యువల్‌కు సంబంధించి రూ.6 లక్షలు ఖర్చు పెట్టినట్లు చెబుతూ సొసైటీ ఫండ్‌ను దారి మళ్లించినట్లు పలువురు సభ్యులు ఆరోపిస్తున్నారు. రెన్యువల్‌కు సంబంధించి సదరు అధికారికి ముడుపులు ముట్టజెప్పినట్లు మరికొందరు సభ్యులు ఆరోపిస్తున్నారు. లోకయుక్త నోటీసులతో అటు అధికారులు తలలు పట్టుకోగా ఇటు 7 మంది సొసైటీ సభ్యులు నష్టనివారణ చర్యల్లో భాగంగా సామధాన దండోపాయాలు ప్రయోగిస్తున్నారు.

ఆపన్న హస్తం కోసం ఎదురు చూపులు

- విధి కన్నెర్ర చేయడంతో కుమారుడు అదృశ్యం, కూతురు మృతి
- అనారోగ్యంతో బస్టాండ్ పాలైన దంపతులు



బస్టాప్‌లో దీనావస్థలో ఉన్న గుర్రం వెంకటేష్

చంపాపేట: చదువుకు తగ్గ చిన్నపాటి ఉద్యోగం.. ఉన్నత చదువు చదివిన భార్య.. ఆ దంపతులకు ఇద్దరు సంతానం.. చీకూచింతా లేని జీవితం.. విధి కాస్తా కన్నెర్ర చేసింది. ఇంకేముంది పిల్లలిద్దరిలో కూతురు అనారోగ్యంతో మృతి చెందగా కుమారుడు అదృశ్యం అయ్యాడు. దంపతులిద్దరికీ అనారోగ్య సమస్యలు వెంటాడటంతో ఉద్యోగం కాస్తా ఊడింది. ఉపాధి లేక దిక్కుతోచని స్థితిలో భార్యాభర్తలిద్దరికీ బస్టాప్ దిక్కైంది. ఆత్మాభిమానాన్ని పక్కన పెట్టి ప్రయాణీకులు చేసే దానాలతోనే అర్ధాకలితో ఉంటూ ఆపన్న హస్తాల కోసం ఎదురు చూస్తున్నారు. వివరాల్లోకి వెలితే... నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండల కేంద్రానికి చెందిన కడు పేద కుటుంబీకుడు గుర్రం వెంకటేష్, రమ దంపతులు. వెంకటేష్ ఇంటర్మీడియట్, భార్య రమ డిగ్రీ పూర్తి చేసింది. గత పదిహేడేళ్ల క్రితం వీరు ఉపాధినెతుక్కుంటూ నగరానికి వచ్చి కర్మన్‌ఘాట్‌లో ఉంటుండే వారు. దంపతులిద్దరూ సెక్యూరిటీ ఏటీఎంల ముందు గార్డులుగా చిన్నపాటి ఉద్యోగాలు చేస్తూ చీకూచింత లేకుండా కాలం వెళ్లదీస్తున్నారు. వీరికి ఇద్దరు సంతానం. వీరి కుటుంబంపై విధి కన్నెర్ర చేసింది. కుమారుడు మూడేళ్ల ప్రాయంలోనే ఇంటి ముంగిట ఆడుకుంటూ అదృశ్యమయ్యాడు. కూతురును అల్లారు ముద్దుగా పెంచుతూ ఇంటర్ వరకు చదివించారు. ఆమె కూడా అనారోగ్యంతో అకస్మాత్తుగా మృతి చెందింది. వెంకటేషకు కీళ్ల సంబంధ వ్యాధి రావడంతో అడుగు తీసి అడుగు వేయలేని స్థితికి చేరాడు. ఉన్న చిన్నపాటి ఉద్యోగం కాస్తా ఊడింది. భర్త దీనావస్తను చూడలేని రమ తనకున్న ఉద్యోగం కాస్తా వదిలేసి వెంకటేష్‌కు సపర్యలు చేయసాగింది. ఉపాధి కరువై చేతిలో చిల్లి గవ్వ లేకపోవడంతో ఇంటి అద్దెను చెల్లించలేక దంపతులిద్దరూ గత రెండు నెలల నుంచి కర్మన్‌ఘాట్ చౌరస్తాలోని బస్టాప్‌లో తలదాచుకుంటున్నారు. ఆత్మాభిమానాన్ని వదిలి ప్రయాణీకులను యాచించి అర్ధాకలితో అలమటిస్తున్నారు. వైట్ రేషన్ కార్డు, ఓటర్ ఐడి ఉన్నప్పటికీ తమకు ప్రభుత్వం నుంచి ఎటువంటి లబ్ధి చేకూరలేదని, దాతలు ఎవరైనా ముందుకు వచ్చి సాయం చేయాలంటూ వారు అభ్యర్థిస్తున్నారు. సాయం చేయాలనుకునే వారు సెల్ 8465907529 నంబర్‌లో సంప్రదించాలని వారు కోరుతున్నారు.

కొండరాయి దొర్లకుండా ప్రత్యేక చర్యలు

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



బండరాయిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: వీరన్నగుట్టపై పగుళ్లు పట్టి దొర్లటానికి సిద్ధంగా ఉన్న కొండరాయి దొర్లకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధి వీరన్నగుట్టపై రామాలయం ప్రక్కన పగుళ్లతో దొర్లటానికి సిద్ధంగా ఉన్న బండరాయితో పెను ప్రమాదం ఉందని స్థానికుల ఫిర్యాదుతో సోమవారం ఎమ్మెల్యే ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బండరాయి దొర్లితే గుట్ట కింది భాగంలో ఉన్న ఇండ్లపై పడి పెను ప్రమాదం సంభవించే అవకాశముందని, పరిస్థితి తీవ్రత దృష్ట్యా బండరాయి దొర్లకుండా షార్ట్ టెండర్‌ను పిలిపించడం జరిగిందన్నారు. బండరాయి చుట్టూ సీసీతో బెడ్స్, ఐరన్ రాడ్స్‌ను ఏర్పరచి చుట్టూరా ఆర్‌సీసీ రిటైనింగ్ వాల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, బస్తీవాసులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి సర్వసౌభాగ్య దేవి త్రయ గీతాజ్ఞాన యజ్ఞం



సమావేశంలో మాట్లాడుతున్న నిర్వాహకులు

లింగోజిగూడ: లోక కల్యాణార్థం ఈ నెల 18వ తేదీ నుంచి మూడ్రోజుల పాటు కర్మన్‌ఘాట్‌లోని శ్రీలక్ష్మీ కన్వెన్షన్‌లో శ్రీసర్వసౌభాగ్య దేవి త్రయ గీతాజ్ఞన యజ్ఞ మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మురుకుంట్ల రాజేశ్వర శర్మ, సురిశెట్టి శ్రీనివాస్‌లు తెలిపారు. సోమవారం కర్మన్‌ఘాట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఈ మహోత్సవానికి ముఖ్య అతిథులుగా విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి, ఎంపీలు పోతుగంటి రాములు, గడ్డం రంజిత్‌రెడ్డి, ఢిల్లీ ప్రభుత్వ సలహాదారు సముద్రాల వేణుగోపాలాచారి, ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, జైపాల్ యాదవ్, స్థానిక కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డిలు పాల్గొంటారని తెలిపారు. మూడ్రోజుల పాటు జరిగే ఈ యజ్ఞ మహోత్సవంలో ప్రత్యేక పూజలు ఉంటాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.



ఆదిత్యానగర్‌కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో..




విజయశ్రీకాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో..

ఘనంగా గోదాదేవి కల్యాణం

మన్సూరాబాద్: గోదాదేవి కల్యాణం మన్సూరాబాద్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ఆదివారం ఘనంగా జరిగాయి. మన్సూరాబాద్ ఆదిత్యానగర్‌కాలనీలో శ్రీలక్ష్మి పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో, విజయశ్రీకాలనీలోని గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవాలు కనుల పండువగా జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కల్యాణంను తిలకించారు.

చైన్ స్నాచర్ అరెస్ట్



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు గొలుసు తదితరాలు

చైతన్యపురి: వృద్ధురాలి మెడలో గొలుసు స్నాచింగ్ చేసిన నిందితుడిని ఎల్‌బీనగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం... బైరామాల్‌గూడలో నివసించే జీహెచ్‌ఎంసీ స్వీపర్ చేతల్ల బావమ్మ ఇంటి సమీపంలోని వీక్లీ కూరగాయల మార్కెట్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా బైక్ వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలోని 27 గ్రాముల బంగారు గొలుసు లాక్కుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజ్ ద్వారా డెలివరి బాయ్ టీషర్టు ఉన్న వ్యక్తిని నిందితుడిగా గుర్తించారు. మలక్‌పేట ముసారంబాగ్‌లో నివసించే కర్నూల్‌కు చెందిన డ్రైవర్ గూడెం సోలయ్య అలియాస్ శామ్యూల్(36) స్నాచింగ్‌కు పాల్పడినట్లు గుర్తించి అరెస్ట్ చేశారు. అప్పులు తీర్చేందుకు జల్సాలకు అలవాటు పడి సులువుగా డబ్బు సంపాదన కోసం చైన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు విచారణలో తెలిసింది. డ్రైవర్‌గా చేస్తూ పార్టు టైం డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడని, స్నాచింగ్ ఘటనలను టీవీల్లో చేసి స్నాచింగ్ చేసేందుకు సోలయ్య పథకం వేసి వృద్ధురాలిని టార్గెట్ చేసినట్లు సీపీ తెలిపారు. నిందితుడి నుంచి 27 గ్రాముల బంగారు గొలుసు, సెల్‌ఫోన్, హీరో హోండా బైక్, హెల్‌మెట్, డ్రైవ్ యూ లోగో టీషర్టు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకున్నారు.

చైనా మాంజా విక్రయ ప్రాంతాల్లో దాడులు

- 57 కేసులు నమోదు



స్వాధీనం చేసుకున్న చైనా మాంజాలు, సామగ్రిని చూపుతున్న సీపీ డీఎస్ చౌహాన్, ఎల్‌బీనగర్ డీసీపీ సన్‌ప్రీత్‌సింగ్

చైతన్యపురి: ప్రమాదకరమైన నిషేధిత చైనా మాంజాలు విక్రయిస్తున్న దుకాణాలపై దాడులు చేసి మొత్తం 57 కేసులు నమోదు చేసినట్లు రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ మాట్లాడుతూ.. చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగోల్ బ్రిడ్జిపై తండ్రితో బైక్‌పై వెళ్తున్న ఆరేళ్ల బాలిక చైనా మాంజా మెడకు చుట్టుకోవడంతో తీవ్రంగా గాయపడిందని, ఈ క్రమంలో పలు ప్రాంతాల్లో ప్రతేక దాడులు నిర్వహించి చైనా మాంజా విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేశామన్నారు. 57 కేసుల్లో 843 మాంజా బాబిన్లు, 966 చైనీస్ మాంజా పౌచ్‌లు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. గాజు పొడితో పూత పూసి తయారు చేసే ఈ మాంజాలు ద్విచక్రవాహనాలపై ప్రయాణించే వారు మరణించిన, గాయపడిన ఘటనలు గతంలో చోటు చేసుకున్నాయన్నారు. మనషులకే కాక గాలిలో తిరిగే పక్షుల కాళ్లు, రెక్కలు విరగటమే కాకుండా చనిపోతాయన్నారు. 2017 నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) వారు చైనీస్ మాంజా ఉత్పత్తులను, నిల్వచేయడం, అమ్మకాలను నిషేధించిందన్నారు. చైనా మాంజా విక్రేతలపై 188, 336 ఐపీసీ సెక్షన్ 5, 15, పర్యావరణ చట్టం–1986 కింద మొత్తం 65 మందిపై కేసులు నమోదు చేశామని సీపీ తెలిపారు.

తవ్విన రోడ్డును పునర్నిర్మించాలి



కమలానగర్‌లో రోడ్డును తవ్వి అలాగే వదిలేసిన దృశ్యం

వనస్థలిపురం: డ్రైనేజీ పైప్‌లైన్ పనుల కోసం తవ్విన రోడ్డును తిరిగి నిర్మించాలని కమలానగర్ కాలనీవాసులు కోరుతున్నారు. హయత్‌నగర్ డివిజన్ కమలానగర్ కాలనీ రోడ్డు నంబర్.17లో ఏడాది క్రితం పైప్‌లైన్ పనుల నిమిత్తం రోడ్డును తవ్వారు. అయితే పైప్‌లైన్ వేసి ఏడాది గడుస్తున్నా రోడ్డును తిరిగి నిర్మించక పోవడంతో ఆ దారిన వెళ్లే కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును తిరిగి నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఐలమ్మ ఫొటోను దహనం చేసిన వారి శిక్షించాలి



ఐలమ్మ చిత్రపటం దహనం చేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

మన్సూరాబాద్: ఈదమ్మ ధోబీఘాట్ కమ్యూనిటీ హాల్ వద్ద వీరనారి చాకలి ఐలమ్మ చిత్రపటాన్ని దగ్ధం చేసిన దుండగులను అరెస్ట్ చేయడంలో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకులు పైళ్ల ఆశయ్య, బోడ్డుపల్లి కృష్ణలు ఆరోపించారు. ఘటనా స్థలం వద్ద దీక్ష చేస్తున్న రజకులను వారు సోమవారం పరామర్శించి మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హయత్‌నగర్ సర్వే నంబర్.207/1లో 1.20 ఎకరాలు రజకుల ధోబీఘాట్‌కు కేటాయించారని, కబ్జాకు గురై నేడు కేవలం 34 గుంటలు మాత్రమే మిగిలి ఉండగా దీనిని కూడా కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అధికారులు, ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే ఈ తతంగం జరుగుతోందని, రజకులంతా ఐక్యంగా ఉండి స్థలాన్ని కాపాడుకుందామని అన్నారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుందామని వారు పిలుపునిచ్చారు. ఈ నెల 19న హయత్‌నగర్ మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద చాకీరేవు కార్యక్రమంతో నిరసన తెలిపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, రాందాసు, నర్సింహ, బాలమ్మ, లక్ష్మమ్మ, సత్యనారాయణ, బలరాం తదితరులు ఉన్నారు.



సందడిగా సంక్రాంతి సంబరాలు

- ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లో మకర సంక్రాంతి
- ఆకట్టుకున్న వాకిళ్లు
- అలరించిన హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు, గగనంలో గాలిపటాలు

'హరిలో రంగ హరి' అంటూ.. హరిదాసు కీర్తనలు.. గంగిరెద్దుల విన్యాసాలు.. గొబ్బెమ్మల అందాలు.. చిన్నారుల కేరింతలు.. ఆకాశంలో గాలిపటాల సందడి.. అమ్మానాన్నలు, అన్నావదినల ఆప్యాయతలు... కొంటె మరదళ్ల అల్లరి చేష్టలతో ఆదివారం సంక్రాంతి పర్వదిన వేడుకలు ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లో సంబరంగా జరిగాయి. ఇందులో భాగంగా తెల్లవారుజాము నుంచే మహిళలు తమ ఇంటి వాకిళ్లను శుభ్రంగా చేసుకుని పోటాపోటీగా రంగోలీ ముగ్గులను వేసి తలస్నానాలు ఆచరించి గొబ్బెమ్మలను ప్రతిష్టించారు. అనంతరం ఇంటికి వచ్చిన కొత్త ధాన్యాలను తమ తమ ఇష్ట దేవుళ్లకు నైవేద్యంగా సమర్పించి కొత్త సంవత్సరంలో పాడి పంటలతో మంచి దిగుబడులు రావాలని వేడుకున్నారు. మరికొందరు కనుమ లక్ష్మి అమ్మవారికి ఇళ్లల్లో ప్రతిష్టించి నోములు జరుపుకున్నారు. అదేవిధంగా పిండి వంటలు చేసుకుని కుటుంబ సమేతంగా భోజనాలు ఆరగిస్తూ ఆనందంగా గడిపారు. తదనంతరం పిల్లలు, యువత గాలిపటాలు ఎగురవేస్తూ సందడి చేశారు. – ఎల్‌బీనగర్, మలక్‌పేట జోన్ల బృందం



సరస్వతీనగర్‌లో...



దిల్‌సుఖ్‌నగర్‌లో..



చంపాపేట మాధవనగర్ కాలనీలో..

సోలీహల్ నగరంలో...

చంపాపేట: సంక్రాంతి సందర్భంగా లండన్‌లోని సోలీహల్ నగరంలో తెలుగు అసోసియేషన్ రైజెస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు, చంపాపేటకు చెందిన లండన్ నివాసితులు కల్లెపల్లి తులసీదేవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా తెలుగింటి షడ్రురుచులతో చేతి వంటలు, సాంప్రదాయ దుస్తుల వేషధారణ, చిన్నారులచే శాస్త్రీయ, జానపద, వెస్టన్ నృత్యాలతో సందడి చేశామని, కార్యక్రమంలో సంస్థ సభ్యులు అల్లూరి రవివర్మ, అనంతుల నీన, మద్దికుంట చైతన్య తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.



నృత్యాలతో కనువిందు చేస్తున్న చిన్నారులు



అక్బర్‌బాగ్‌లో పతంగులు ఎగుర వేస్తున్న ఎమ్మెల్యే బలాల, స్థానికులు

ఆర్టిస్టి క్లిక్ ది ప్రీ స్కూల్‌లో..

సంక్రాంతి పర్వదినంను పురస్కరించుకుని కొత్తపేటలోని ఆర్టిస్టి క్లిక్ ది ప్రీ స్కూల్‌లో సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా చిన్నారులు సాంప్రదాయ దుస్తులు ధరించగా.. పాఠశాల ఫౌండర్, ప్రిన్సిపాల్ ఎం.నీలిమ, కో–ఫౌండర్ చక్రీజాక్సన్‌ల ఆధ్వర్యంలో భోగి, మకర సంక్రాంతి, కనుమ యొక్క ఔన్నత్యం ఉట్టిపడేలా అలంకరణ చేశారు. అనంతరం చిన్నారులను భోగిపండ్లతో ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

